క్లుప్తంగా

రూ.లక్ష చెక్కు అందజేత

నెల్లూరు సిటీ : విజయవాడ వరద బాధితుల కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని 20వ డివిజన్ ఇస్కాన్ సిటీ ప్రాంతానికి చెందిన పమిడి శ్రీనివాసులు కుటుంబం అందించింది. ఈ మేరకు చెక్కును రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఆయన కార్యాలయంలో గురువారం అందజేశారు. కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు పాల్గొన్నారు.

కాకాణితో కొండ్రెడ్డి భేటీ



నెల్లూరు సిటీ : విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో గురువారం భేటీ అయ్యారు. నగరంలోని డైకాస్ రోడ్డులో ఉన్న కాకాణి క్యాంపు కార్యాలయంలో పలు అంశాలపై వారు చర్చించారు. పాశం శ్రీనివాస్, ఏసు నాయుడు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్

నెల్లూరు(దర్గామిట్ట) : గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్–6 డిజిటల్ అసిస్టెంట్లకు కలెక్టర్ ఆదేశాలతో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీపీఓ సుస్మిత తెలిపారు. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు 11వ తేదీ, గ్రేడ్–6 డిజిటల్ అసిస్టెంట్లకు 12వ తేదీ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

పెనుబర్తి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని పెనుబర్తి సర్పంచ్ సృజన చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ డీపీఓ సుస్మిత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె నిధులను దుర్వినియోగం చేసిందని ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకున్నట్లు డీపీఓ తెలిపారు.

మార్ట్‌గేజ్ విడుదల పేరిట మహామోసం

- టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలోని నెల్లూరు, ఒంగోలు, గుంటూరు తదితర పలు కార్పొరేషన్లలో మార్ట్‌గేజ్ విడుదల పేరిట భారీ అవినీతి చోటు చేసుకుందని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి అన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఆధారాలతో సహా గురువారం ఆయన కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లలో మార్ట్‌గేజ్ విడుదల పేరిట భారీ అవినీతి జరిగిందన్నారు. ఒక్క నెల్లూరు కార్పొరేషన్‌లోనే 72 మార్టిగేజ్‌లు రిలీజ్ చేయడం వల్ల రూ.65 కోట్లు కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లిందన్నారు. వారం రోజుల్లో చర్యలు లేకుంటే హైకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు.

మట్టి గణపయ్యా.. ప్రణామం

- పర్యావరణ పరిరక్షణకు దోహదపడుదాం
- జల వనరులను కాపాడుకుందాం



మట్టి గణపయ్యలకు రంగులు అద్దుతున్న మహిళ

నెల్లూరు(బారకాసు)/నెల్లూరు(సెంట్రల్): వినాయక చవితికి సహజ వనరులతో తయారైన మట్టి ప్రతిమలను పూజిద్దామని ప్రతిఏటా జోరుగా ప్రచారం జరుగుతుంది. అయినా చవితి రోజు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు మండపాల్లో కొలువుదీరుతాయి. పూర్వకాలం నుంచి వినాయక చవితి రోజున మట్టి ప్రతిమలను మాత్రమే పూజించేవారు. అయితే కాలానుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వినియోగంలోకి వచ్చాయి. ఇవి పూజకు నిషిద్ధమని ఇటు పండితులు, అటు పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. స్వచ్ఛమైన మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమనే పూజకు ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు. వినాయకుని తత్వం పృథ్వీమయం అని పురాణాల్లో ఉంది. భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారుచేసి పూజించాలని పండితులు పేర్కొంటున్నారు. మట్టితో చేసిన విగ్రహం ఎక్కువకాలం ఉండదు కాబట్టి నిమజ్జనం చేయాలని చెప్పారు.

ఎందుకంటే

మట్టి విగ్రహాల నిమజ్జనంతో జల వనరులకు ఎలాంటి నష్టం ఉండదు. సహజసిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను వినియోగించడం వల్ల పర్యావరణానికి ఎలాంటి ప్రమాదం ఉండదు. అదే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలు కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేసినా కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి. ఈ ప్రతిమలకు పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. అదే నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుంది. దీనివల్ల నేల, నీరు, గాలి అన్నింటిపైనా కాలుష్య ప్రభావం ఉంటుంది.

పీఓపీ విగ్రహాలే వాడుతున్నారు



పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ రసాయనాలతో తయారు చేసే విగ్రహాలనే వాడుతున్నారు. దీనివల్ల వచ్చే అనర్థాలపై అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– సుబ్బారెడ్డి, సత్యనారాయణపురం

మట్టి విగ్రహాలే శ్రేష్టం



మట్టి విగ్రహాలే పూజకు శ్రేష్టం. రసాయనాలతో తయారు చేసే పీఓపీ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే ఆ నీరు కలుషితమవుతుంది. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలి.

– డాక్టర్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ విశ్రాంత వైద్యుడు

ఎంతో మేలు



వివిధ రకాల రంగులతో చేసిన వినాయక ప్రతిమలు నీటిలో కలవడానికి చాలా రోజులు పడుతుంది. అందుకే సహజసిద్ధంగా తయారు చేసిన గణనాథుని విగ్రహాలకు పూజలు చేద్దాం. పర్యావరణాన్ని రక్షించే బాధ్యత మనందరిపై ఉంది.

– రాజశేఖర్, ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

మట్టి ప్రతిమలతో ఇబ్బందులుండవు



పాత కాలంలో మట్టితో చేసిన వినాయక ప్రతిమలతో ఉత్సవాల జరుపుకునే వాళ్లం. వాటి వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఇప్పుడు కూడా సాధ్యమైనంత వరకు సహజసిద్ధమైన ప్రతిమలనే వాడుకుందాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం.

– కొండారెడ్డి, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి

నిబంధనలు పాటించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో నిబంధనలు తప్పక పాటించాలని ఆ శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్, డీఆర్డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తెలిపారు. నగరంలోని సాంఘిక సంక్షేమశాఖ డీడీ కార్యాలయంలో సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మెనూ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలని, వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వినాయక మండపాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు టౌన్–2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదనరెడ్డి తెలిపారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వెళ్లే మార్గంలో విద్యుత్ లైన్లను పరిశీలించి తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను సరిచేయాలన్నారు. వినాయక మండపాల్లో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది పర్యవేక్షించాలని తెలియజేశారు.

విరాళాల సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విజయవాడ వరద బాధితుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్, ట్రంకురోడ్డు, కాపువీధి పరిసరాల్లో గురువారం విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, నగరాధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రాంబాబు, సుధాకర్, మురళి, కామాక్షమ్మ, మల్లెమ్మ, పెరియతంబి, అర్జున్, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి టీవీఎస్ జూపిటర్

నెల్లూరు(అర్బన్) : మార్కెట్‌లోకి సరికొత్త టీవీఎస్ జూపిటర్ 110 బైక్ విడుదలైంది. నగరంలోని దర్గామిట్టలో ఉన్న విష్ణుప్రియ టీవీఎస్ షోరూంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ నూతన బైక్‌ను కంపెనీ సేల్స్ మేనేజర్ చంద్రవేణుకుమార్ ఆవిష్కరించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : పప్పులవీధిలోని శ్రీసిద్ధి విఘ్నేశ్వరాలయంలో శుక్రవారం నుంచి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ బయ్యా ప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో గురువారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 6 నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

- యువకుడి దుర్మరణం

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నేతాజీ నగర్‌లో రమేష్ నాయుడు కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు కుమార్తె, కుమారుడు సతీష్ (26) సంతానం. కుమార్తెకు వివాహమైంది. సతీష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్నాడు. అతను బుధవారం రాత్రి అనిల్ గార్డెన్స్ వద్ద స్నేహితులను కలిసి వినాయక చవితి ఉత్సవాల గురించి చర్చించాడు. అర్ధరాత్రి బైక్‌పై మినీబైపాస్ రోడ్డు మీదుగా ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సతీష్ కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జీజీహెచ్ వైద్యులు గురువారం మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురువులను సత్కరించడం బాధ్యత



నెల్లూరు(అర్బన్): విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులను సన్మానించుకోవడం అందరి బాధ్యత అని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్‌లో గల ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో గురుపూజోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, రెడ్‌క్రాస్ సభ్యులు స్పాస్టిక్స్ సెంటర్ ఉపాధ్యాయులను సత్కరించారు. తొలుత ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో ఫిజియోథెరపీ వైద్యులు వాసు, నవీన్, నవీద్, అక్తర్ తదితరులు రక్తదానం చేశారు. స్పాస్టిక్స్ సెంటర్ కన్వీనర్ సుబ్బారెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ గుర్నాథరావు, కో కన్వీనర్ బలరామయ్యనాయుడు, సెక్రటరీ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక సాయం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న సభ్యులు

నెల్లూరు(దర్గామిట్ట): విజయవాడ వరద బాధితుల కోసం జిల్లా రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. గురువారం సాయంత్రం కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో కలిసి సీఎం సహాయనిధికి రూ.1,10,116 చెక్కును అందించారు. అలాగే అసోసియేషన్ ట్రెజరర్ నంబూరు మస్తానయ్య మరో రూ.15 వేల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు జమ చేయాలని కలెక్టర్‌కు ఇచ్చారు. బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చిన రిటైర్డ్ ఉద్యోగులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యం నరసింహులు, ప్రధాన కార్యదర్శి దూర్జటి వెంకట సుధాకర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ జనార్ధనరావు, వి.కృష్ణారావు, రామలింగేశ్వరరావు, అక్కరాజు మధుసూదన్‌రావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో హెచ్‌ఐవీ దూరం

నెల్లూరు(అర్బన్) : ప్రజల్లో అవగాహన పెరిగి విలువలకు కట్టుబడి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా హెచ్‌ఐవీ వ్యాధిని సమాజం నుంచి దూరం చేయగలమని ది నెట్వర్క్ ఆఫ్ ది పీపుల్ లివింగ్ విత్ హెచ్‌ఐవీ ఎయిడ్స్ సీఎస్సీ 2.0 నెల్లూరు ప్రాజెక్టు డైరెక్టర్ వి.ధనుర్జా అన్నారు. నగరంలోని సుస్మిత నర్సింగ్ కాలేజీలో హెచ్‌ఐవీ వ్యాధిపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుర్జా మాట్లాడుతూ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల కృషితో ప్రజల్లో అవగాహన పెరిగి గత రెండు దశాబ్దాల్లో హెచ్‌ఐవీని చాలా వరకు నియంత్రించామన్నారు. అయితే ఇటీవల అక్కడక్కడ మళ్లీ కేసులు పెరుగుతుండడం బాధాకరమన్నారు. మంచి సమాజం కోసం హెచ్‌ఐవీని కూకటివేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు వైద్యసిబ్బంది, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సిబ్బంది సరేష్, బాలకృష్ణ, చెన్నమ్మ, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట) : ఏకలవ్య పాఠశాలలో తిష్టవేసిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి జుయల్ ఓరమ్‌ను కోరారు. కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్‌లోని సమస్యలపై కేంద్ర మంత్రికి నివేదికను అందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, తెలుగు తెలిసిన వ్యక్తులను నియమిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని కేంద్ర మంత్రికి వివరించారు. ఆయా విభాగాలకు పర్మినెంట్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. ఏకలవ్య పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మంత్రి ఆయనకు హామీ ఇచ్చారు.

➡ కోవూరు నియోజకవర్గంలో రూ.49 కోట్ల అంచనాతో బుచ్చి– ఊటుకూరు రహదారి అభివృద్ధికి సహకరించాలని కేంద్ర రహదారుల అభివృద్ధి విభాగం డైరెక్టర్ జనరల్ సారంగిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన పలు సమస్యలను వివరించి, పరిష్కరించాలని కోరారు.

11న సామూహిక నిమజ్జనం

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



గణేశ్ ఘాట్‌ను పరిశీలిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : హైదరాబాద్ తరహాలో నెల్లూరు నగరంలో ఒకేరోజు సామూహిక వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులందరూ సిద్ధంగా ఉండాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి సమీపంలో గణేశ్ ఘాట్ వద్ద జరుగుతున్న పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతనిధులు పాల్గొన్నారు.

➡ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్‌లో రూ.కోటి నిధులతో సీసీరోడ్లు, డ్రెయిన్ల పనులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని తెలిపారు.

సమాజ నిర్మాణంలో గురువులే కీలకం



సన్మానం అందుకున్న విశ్రాంత ఉపాధ్యాయులతో నిర్వాహకులు



కేపీసీ జూనియర్ కళాశాలలో..



విశ్వసాయి జూనియర్ కళాశాలలో..

నెల్లూరు(బారకాసు) : సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని ది నెల్లూరు డిస్ట్రిక్ట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేరూరి సుధీర్‌కుమార్ తెలిపారు. నగరంలోని రంగనాయకులపేట, గొల్లవీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం వంద మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అలాగే పలువురు టీచర్లను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అయితా భాస్కర్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ నరేంద్రబాబు, వైస్ ప్రెసిడెంట్ కేపీ ప్రసాద్ పాల్గొన్నారు.

➡ నగరంలోని మోడల్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాసరావును బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, స్థానిక నేతలు పెంచలయ్య, ఖాదర్, శివ, కుమార్, అంకయ్య, సాయిశ్రీనివాసులు, మురళి, అజయ్, సెల్వం, గిరి పాల్గొన్నారు.

➡ నెల్లూరు(బృందావనం) : స్థానిక బీవీనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో గురుపూజోత్సవం గురువారం ఘనంగా జరిగింది. 'స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్' జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్‌ఎం.గౌస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 43 మంది విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. సమాజహితాన్ని కాంక్షించే వారు ఉపాధ్యాయులని తెలిపారు. వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి డి.గంగాద్రి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సీహెచ్.పెంచలరెడ్డి, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి అహ్మద్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీవీఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు ఖాజారసూల్, ఉపాధ్యక్షులు వి.వీరేంద్రనాథ్, డి.గోపాల్, కోశాధికారి జె.హజరత్తయ్య, వివిధ ప్రాంతాలకు చెందిన అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

➡ పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జెడ్పీ వాకర్స్ సంఘం అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో గతేడాది పదో తరగతిలో అధిక మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ముగ్గురు బాలురు, నలుగురు బాలికలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు అందజేసి అభినందించినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు సీహెచ్.భాస్కర్‌రెడ్డి, తుంగా నారాయణరెడ్డి, కార్యదర్శి ఖాజామస్తాన్, కోశాధికారి యు.చెంచయ్య, పూర్వ కార్యదర్శి బి.రామిరెడ్డి, మేరీ బ్లెస్సింగ్టన్, హర్షవర్ధిని, రాణెమ్మ, ఎమ్వీ కృష్ణయ్య, సీఎల్ ప్రసాద్, టి.రమణమూర్తి పాల్గొన్నారు.

➡ నెల్లూరు (టౌన్) : నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు రాధారాణి, సుబ్బయ్యలను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్, రమణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు మునిరాజా, పులిచెంచయ్య రవికృష్ణ పాల్గొన్నారు.

➡ మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని ఏనుగు సుందరరామిరెడ్డి మున్సిపల్ స్కూల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ పిల్లలకు మంచి, చెడుల గురించి చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

➡ ఏసీనగర్‌లోని భాష్యం స్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్, లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జి అస్మతాజ్ పాల్గొన్నారు.

➡ స్థానిక తురిమెల నాగిరెడ్డి పాఠశాలలో విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్, తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రభాయి పూలే తదితరుల వేషధారణలో అలరించారు. హెచ్‌ఎం కొండమ్మ, ఉపాధ్యాయుడు పాశం శిల్ప పాల్గొన్నారు.

➡ కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు హరీష్, సోమశేఖరరావు, వలంటీర్ రాశిలను సన్మానించారు. అనంతరం బహుమతులుగా మొక్కలను అందజేశారు.

➡ నెల్లూరు(అర్బన్) : వీహెచ్‌పీ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డైకస్‌రోడ్డులోని రూడ్స్ కార్యాలయంలో గురుపూజోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత హెచ్‌ఎం కుడుమల సుబ్బారావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుబహాన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, ఉపాధ్యక్షుడు సత్తార్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వసుంధర, విశ్రాంత ఏఎస్పై మహబూబ్‌బాషా, నవ్యాంధ్ర రచయితల సంఘం నాయకులు రాఘవేంద్రశేఖర్, రహమాన్, అంజాద్, నారాయణ పాల్గొన్నారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రూరల్ మండలంలోని దీన్‌దయాళ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న సీహెచ్ శాంతకు ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఎంఈఓ కార్యాలయంలో ఆమెను గురువారం సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలేంద్రబాబు, ఎంఈఓలు తిరుపాలు, సయ్యద్‌అహ్మద్, మధుసూదన్ పాల్గొన్నారు.



తురిమెల నాగిరెడ్డి పాఠశాలలో..



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో జెడ్పీ వాకర్స్ సభ్యులు



గురువులను సన్మానిస్తున్న వీహెచ్‌పీ, రూడ్స్ సంస్థల ప్రతినిధులు



టీచర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు